క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



నెహ్రూనగర్ సత్యసాయి మందిరంలో సామూహిక సత్యసాయి వ్రతంలో భక్తులు

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతి పురస్కరించుకొని సోమవారం నెహ్రూనగర్ సాయి మందిరం, వన్‌టౌన్ ఇస్కాల శ్రీకృష్ణ స్వామి సత్రంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ, సత్యసాయి వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సాయినామ స్మరణ భజన చేశారు. సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, సాయిబాబా, సరోజ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలపై శిక్షణ



మాట్లాడుతున్న ఆర్జేడీ కె.శామ్యూల్

కర్నూలు సిటీ: నాయకత్వ లక్షణాలపై మండల విద్యాధికారులకు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆరు రోజుల పాటు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇచ్చే రెండో విడత శిక్షణ సోమవారం ప్రారంభమైంది. మూడు జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను సోమవారం పాఠశాల విద్య ఆర్జేడీ కె.శామ్యూల్ ప్రారంభించి ప్రసంగించారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధి చెందేలా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి విద్యార్థిలో నాయకత్వ లక్షణాలను పెంచేలా తరచుగా మాట్లాడుతుడాలని, విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలన్నారు. టీచర్ పరిశీలనలో గుర్తించిన లక్షణాలను బట్టి విద్యార్థుల్లో లీడర్‌షిప్ క్వాలిటీ ఏ మేరకు ఉందో చూడాలన్నారు. మాస్టర్ ట్రైనర్స్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంఓ డాక్టర్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌టీ మీటర్ల రీడింగ్‌లో నిర్లక్ష్యం వద్దు

కర్నూలు న్యూసిటీ: హైటెన్షన్ వోల్టేజీ రీడింగ్‌లు తీయడంలో నిర్లక్ష్యం వహిస్తే బిల్లుల తేడాతో సంస్థకు నష్టం వాటిల్లుతుందని, దీన్ని నివారించేందుకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఉమాపతి తెలిపారు. ఆయన ఆదివారం విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో ఎంఆర్‌టీ సమావేశం నిర్వహించారు. హెచ్‌టీ, సీటీ మీటర్లను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. చెడిపోయిన మీటర్లను సకాలంలో మరమ్మతులు చేయించి సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశ్రమల వద్ద వ్యాపార సముదాయ భవనాల వద్ద విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు. సమావేశంలో ట్రాన్స్‌ఫార్మర్స్ ఈఈ బి.లత, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ ముక్తార్ బాషా

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పడిదెంపాడు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మండల అసిస్టెంట్ ఇంజినీర్ ముక్తార్ బాషా సోమవారం పరిశీలించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పడిదెంపాడు గ్రామంలో రూ.18 లక్షలతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. గడువులోగా పనులను పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ అమీర్ ఉన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల బ్యారేజీ నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. బ్యారేజీకి ఎగువ నుంచి 9,220 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, 2,445 క్యూసెక్కుల నీటిని కేసీ కెనాల్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీలో 1.2 టీఎంసీల పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు నీటి నిల్వ ఉంది. 6,759 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

20న సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాల బాలికలకు సెపక్‌తక్రా క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సెపక్‌తక్రా సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని, ఈ నెల 26, 27 తేదీల్లో నందికొట్కూర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 94402 57242 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

- కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలకు జాప్యం లేకుండా నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టర్, జేసీ డాక్టర్ బి.నవ్య ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని, రీఓపెన్ కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వారంలో 9 అర్జీలను ఇప్పటి వరకు రెవెన్యూ, పోలీసుల, అటవీశాఖ, చేనేత జౌళి, రిజిస్ట్రేషన్, డీఎస్‌డీఓ, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు కనీసం చూడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రీ ఓపెన్ కేసుల్లో 25 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎంఓ గ్రీవెన్స్‌కు సంబంధించి 16 దరఖాస్తులుపెండింగ్‌లో ఉన్నాయని, వాటిపరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇటీవల రెవెన్యూ, సర్వే శాఖ నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించడంపై దృష్టిసారించాలని జేసీ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్‌చిరంజీవి పాల్గొన్నారు.

అపార్‌ను వేగవంతం చేయండి

విద్యార్థులు అపార్ ఐడీ జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా విద్యాశాఖాధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్ నుంచి మండలాధికారులతో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అపార్ ఐడీ జనరేషన్ ప్రక్రియ 60 శాతం పూర్తయింది. ఇంకా పెండింగ్‌లో 20,430 మంది విద్యార్థుల అపార్ ఐడీ జనరేషన్ ప్రక్రియ పెండింగ్‌లో ఉందన్నారు. హౌసింగ్‌కు సంబంధించి ఈ వారంలో 76 ఇళ్లు పూర్తి చేశారని, గత రెండు నెలల్లో 572 ఇళ్లను పూర్తి చేశారని, 1,270 ఇళ్ల స్టేజ్ కన్వర్షన్ మారినట్లు చెప్పారు. ప్రతి నెలా 1000 ఇళ్లు పూర్తవ్వాలన్న లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో రీసర్వే సంబంధించిన ఫిర్యాదులు 18,600 వచ్చాయని, వీటిని డిసెంబర్ 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలోనే ఎంఎస్‌ఎంఈ సర్వే ప్రారంభం అవుతుందని,ఈ అంశంపై అధికారులకు శిక్షణ ఇవ్వాలని ఎంపీడీఓలకు ఆదేశించారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): నంద్యాల జిల్లా చిన్న చెరువులో ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ డ్రాగన్ బోట్ చాంపియన్‌షిప్–2024 సీనియర్ పురుషులు, మహిళలు మిక్స్‌డ్ విభాగంలో జిల్లా క్రీడాకారులు కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సోమవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడల అధికారి భూపతిరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

పడిపోయిన ఉల్లి ధర

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఉల్లి ధర పడిపోయింది. ఈ నెల 16వ తేదీ వరకు గరిష్ఠ ధర రూ.4,600 వరకు ఉంది. సోమవారం ధర పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు 324 మంది రైతులు 5,755 క్వింటాళ్ల ఉల్లి తెచ్చారు. కనిష్ఠ ధర రూ.522, గరిష్ఠ ధర రూ.4,152 లభించింది. సగటు ధర రూ.3,791 నమోదైంది. ఈ నెల 16వ తేదీతో పోలిస్తే క్వింటాలుపై రూ.449 తగ్గింది. వ్యాపారులు సిండికేట్ కావడం కూడా ఒక కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డ్రైనేజీ నిర్మాణాలను పూర్తి చేయండి



ఆనంద్ థియేటర్ వద్ద అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు (టౌన్): నగరంలో ఆనంద్ థియేటర్ సమీపంలోని కేసీ కెనాల్ వంతెన వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక ఆనంద్ థియేటర్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వంతెన వద్ద లీకేజీ కారణంగా నీటిని నూతన డ్రైనేజీలోకి మళ్లిస్తునట్లు చెప్పారు.

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పరిశీలన

స్థానిక వెంకటరమణ కాలనీలోని నూతనంగా నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం కమిషనర్ రవీంద్రబాబు పరిశీలించారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, రెవెన్యూ సూపరింటెండెంట్ వాజిద్, జునీద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ కాంప్లెక్స్‌లో కొన్ని షాపులు మాత్రమే వ్యాపారులకు కేటాయించారన్నారు. అనేక షాపులు ఖాళీగా ఉన్నాయన్నారు. నిబంధనల ప్రకారం షాపుల కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలి

నగరంలో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని కమిషనర్ రవీంద్రబాబు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్, పాత ఈద్గా, కల్లూరు రోడ్డు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కాలువల్లో మురుగు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు.

స్థలం ఆక్రమించి అపార్టుమెంట్ నిర్మాణం

- పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు సమర్పించిన నగరవాసులు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



కమిషనర్ ఎస్.రవీంద్రబాబుకు సమస్యను వివరిస్తున్న నగరవాసి

కర్నూలు (టౌన్): కల్లూరు పరిధిలోని సర్వే నంబర్ 601ఏ లో 16 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి కొందరు అపార్టుమెంటు నిర్మిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో వచ్చిన 19 అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- ధర్మపేటలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, కేసీ కెనాల్ వెంట రక్షణ వలయం మరమ్మతులు చేపట్టాలని స్థానికులు దానన్న విన్నవించారు.
- రిచ్మండ్ కాలనీలో ఉన్న ప్రధాన మురుగు కాల్వను వక్కెర వాగుకు అనుసంధానం చేయాలని, నాలుగు పార్కులను అభివృద్ధి చేయాలని కాలనీ అసోసియేషన్ నాయకులు ధర్మరాజు, సుకుమార్ అభ్యర్థించారు.
- అనర్హత వచ్చిన కారణంగా తాము చెల్లించిన టిడ్కో ఇంటి నగదును వెనక్కి ఇవ్వాలని ఉషారాణి అనే మహిళ విన్నవించారు.
- కాలనీలో రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని జోహరాపురం బీడీ వర్కర్స్ కాలనీలో నివసించే స్థానికులు షరీఫ్, సుభాన్, మాలిక్ బాషా, అబ్దుల్ రసూల్ ఫిర్యాదు చేశారు.
- రేడియో స్టేషన్ సమీపంలోని గీతాంజలి అవెన్యూ రెసిడెన్షియల్ భ్రమరాంభ నగర్ కాలనీల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేదని కాలనీ వాసులు వెంకటనాయుడు, లలితమ్మ ఫిర్యాదు చేశారు.
- సుంకేసుల రోడ్డు పెట్రోల్ బంకు వద్ద ఉన్న ధన లక్ష్మీ నగర్‌లో మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని స్థానికులు నారాయణ రెడ్డి, రామిరెడ్డి అభ్యర్థించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



సూర్యాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



నెహ్రూనగర్ సాయీశ్వరాలయంలో..



తాండ్రపాడులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం సోమవారాన్ని పురస్కరించుకొని నగరంలోని శైవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున, సాయంత్రం సంధ్యా సమయంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు జరిగాయి. కర్నూలు నగరం ఓల్డ్‌సిటీలోని నగరేశ్వర స్వామి ఆలయం, లలితా పీఠం, సప్తగిరి కైలాసగిరి ఆలయం, దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, నెహ్రూనగర్ సాయీశ్వరాలయం, అశోక్‌నగర్, శ్రీరామ్‌నగర్ శివాలయాలు, బుధవార పేట ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం, వైద్య కళాశాల మైదానం నీలకంఠ స్వామి ఆలయం , నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని మహాగౌరీ శంకర ఆలయం , మాధవ నగర్ శివరామాలయం, జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.



లలితా పీఠంలో శివలింగం ఆకృతిలో వెలిగించిన దీపాలు

20న జాబ్‌మేళా

కర్నూలు(అగ్రికల్చర్): డీఆర్‌డీఏ–సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల తెలిపారు. ప్యూసియన్ ఫైనాన్స్ ప్రైవేటు సంస్థలో 24 రిలేషన్‌షిప్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, స్త్రీ, పురుష అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరుకావొచ్చన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.18700 వేతనం ఉంటుందని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సదుపాయంతో పాటు మెడికల్ ఇన్సూరెన్స్ కూడా ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన యువత విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, 4 పాస్‌ఫొటోలతో కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు సమీపంలోని టీటీడీసీలో జరిగే ఇంటర్వ్యూలకు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 90142 96452, 92953 55950 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా సహకార సంఘాల వారోత్సవాలు

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో 71వ అఖిలభారత సహకార సంఘాల వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఉల్చాల సహకార పరపతి సంఘం ఇన్‌చార్జ్ విజయభారతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు జిల్లా డివిజన్ కో–ఆపరేటివ్ ఆఫీసర్ షేక్ జఫ్రీన్ మాట్లాడుతూ.. సహకార సంఘంలో రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. అదే విధంగా సహకార సంఘం ద్వారా గ్రామంలో రైతులకు సబ్సిడీ ధరకే ఎరువులు, వ్యవసాయ యంత్ర వాహనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సబ్ డివిజనల్ అధికారి నాగరామయ్య, రామకృష్ణ, మున్వర్ బాషా, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

ఆదోని అర్బన్: పట్టణంలోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మట్కా రాస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. తాహేర్, ఉదయ్‌కుమార్ మట్కా రాస్తుండగా దాడి చేసి వారి వద్ద నుంచి రూ.10 వేల నగదు, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామలింగయ్య తెలిపారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ సూచించారు. సోమవారం వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కర్నూలు మెడికవర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో వర్సిటీలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి రోజు వ్యాయామం, యోగా, ధ్యానం చేయాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ ఆచార్య సి.వి.కృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్‌గా చిన్నటేకూరు గురుకుల కళాశాల

కల్లూరు: వైఎస్సార్ కడప జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల గండిక్షేత్రంలో ఈ నెల 14 నుంచి 17వ వరకు ఉమ్మడి నాలుగు జిల్లాలకు చెందిన అంతర్ పాఠశాలల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చిన్నటేకూరు గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు ఖోఖోలో విజయం సాధించగా, కబడ్డీ, వాలీబాల్‌లో రన్నర్స్‌గా నిలిచారు. అథ్లెటిక్ విభాగంలో షాట్‌పుట్‌లో మొదటి స్థానం, జావలిన్‌త్రోలో మూడోస్థానం, లాంగ్‌జంప్‌లో రెండో స్థానం, డిస్కస్‌త్రోలో మూడవ స్థానం సాధించారు. ఉమ్మడి రాయలసీమకు చెందిన నాలుగు జిల్లాలకు చెందిన గురుకుల కళాశాల, పాఠశాలల పోటీలో అన్ని క్రీడాల్లో ప్రతిభ కనపర్చిన చిన్నటేకూరు గురుకుల కళాశాల విద్యార్థులు ఓవరాల్స్ గేమ్స్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. దీంతో సోమవారం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపాల్ మహానంది, ఐఐటీ, నీట్ అకాడమి డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు.. ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్, పీఈటీ కిరణ్‌కుమార్‌లను, విద్యార్థులను అభినందించారు.

ఏకాగ్రతతో సాధన చేస్తే విజయం తథ్యం



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హర్షవర్ధన్

కర్నూలు (టౌన్): ఏకాగ్రతతో సాధన చేస్తే క్రీడాకారులు తప్పక విజయం సాధిస్తారని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి హర్షవర్ధన్ సూచించారు. రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్–14, అండర్–17 విభాగంలో ఎంపికైన క్యారమ్స్ క్రీడాకారులు మంచి ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. స్కూల్‌గేమ్స్ అసిస్టెంట్ కార్యదర్శి సుంకారావు, పరమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పావురాలు, బెలూన్లను గాల్లోకి వదలుతున్న కమాండెంట్ ప్రభుకుమార్ తదితరులు

కర్నూలు(టౌన్): పటాలపు సిబ్బంది స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్‌పీ 2వ పటాలపు కమాండెంట్ ప్రభుకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏపీఎస్‌పీ క్యాంపు క్రీడా మైదానంలో 7వ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శాంతికి చిహ్నమైన పావురాలు, బెలూన్లను గాలిలోకి వదిలారు. కమాండెంట్ మాట్లాడుతూ.. తీరిక లేకుండా శ్రమించే పటాలపు సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వల్ల ఉపశమనం కలుగుతుందన్నారు. క్రీడల వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని, సిబ్బంది ఈ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పటాలపు అదనపు దళాధిపతి నాగేంద్రరావు, సహాయక దళాధిపతులు మహబూబ్‌బాషా, రవికిరణ్, సుధాకర్ రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో అధిక రక్తపోటు



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): మానసిక ఒత్తిడి కారణంగా అధిక రక్తపోటు వస్తుందని డెమో శ్రీనివాసులు చెప్పారు. సోమవారం స్థానిక గడ్డ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బడి వీధి సచివాలయంలో జరుగుతున్న ఎన్‌సీడీ 3.0 సర్వే, అసంక్రమణ వ్యాధుల నిర్ధారణ పరీక్షల స్క్రీనింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం, గంటల తరబడి కూర్చుని పనిచేయడం, ఒత్తిడి కారణంగా అధిక రక్తపోటు వస్తుందన్నారు. మనం తీసుకునే ఆహారంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మారుతున్న జీవనశైలి కారణంగా కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయని, నిత్యం ఒత్తిడితో కూడుకున్న జీవితం, క్షణం తీరిక లేకుండా మనిషి ఒత్తిడితో సతమతమవుతున్నాడన్నారు. అలసట, తల తిరగడం, దాహంగా ఉండటం, దృష్టి సమస్య లు, ఏకాగ్రత లేకపోవడం, ఛాతినొప్పి, తీవ్రమైన తల నొప్పి రక్తపోటు లక్షణాలన్నారు. ఉప్పు ఎక్కు వగా ఉండే నిల్వ పచ్చళ్లు, అప్పడాలు, సోడా ఉప్పు వేసి వండిన ఆహార పదార్థాలు, శీతల పానియాలు, జంక్ ఫుడ్, బజ్జీలు, బ్రెడ్, బిస్కట్లు, చిప్స్ వంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఎస్‌ఓకు పోస్టింగ్ ఇవ్వడంపై నిరసన

- విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వం నుంచి విద్యార్థులకు వచ్చిన సొమ్మును కాజేసి అవినీతికి పాల్పడిన ఎమ్మిగనూరు కేజీబీవీ పాఠశాల ఎస్‌ఓ కవితకు మళ్లీ పోస్టింగ్ ఇవ్వడంపై కలెక్టర్, విద్యాశాఖాధికారులు సమాధానం చెప్పాలని విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్‌నాయుడు, మహేంద్రబాబు, సురేంద్రబాబు, కృష్ణ, ఆఫ్రిద్ తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలల క్రితం ఎమ్మిగనూరు కేజీబీవీ ఎస్‌ఓ కవిత అవినీతిపై అధికారులు విచారణ జరిపి అక్రమాలు నిగ్గుతేల్చడంతో ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. అయితే పది రోజుల క్రితం ఆమె మళ్లీ అక్కడే ఎస్‌ఓగా విధుల్లో చేరారని, దీనిపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఏ ప్రతిపాదికన ఆమెను విధుల్లో చేర్చుకున్నారని, తమకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె నుంచి రికవరీ రాబట్టిన తరువాతే ఉద్యోగంలోకి తీసుకోవాలని, లేకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. అనంతరం జేసీ డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రామకృష్ణ, హరికృష్ణ, ఆర్యన్, ప్రమోద్, లక్ష్మణ్, బాషా, చరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



మాట్లాడుతున్న చంద్రశేఖర కల్కూర

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు సోమవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ.. విద్యార్థులు సహపాఠ్యాంశాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనాలన్నారు. దీంతో విషయ అవగాహనతో పాటు పోటీతత్వం అలవడుతుందన్నారు. న్యాయ నిర్ణేతలుగా గంగిరెడ్డి, దొరస్వామి, నాగరాజు, కేశవాచార్యులు వ్యవహరించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ డిప్యూటీ సెక్రటరీ పెద్దక్క అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, భాష, చంద్రమ్మ, నసీమా, శ్రీనివాసులు, రేణుక, తదితరులు పాల్గొన్నారు.